చేసి ఎంతో ధైర్యంతో ఆహార సమస్యా పరిష్కారానికి కృషిచేస్తున్నారు. అన్నవస్త్రాలు, కార్మికుల జీవనోపాధిని గురించి వీరు ముగ్గురు చేస్తున్న కృషిఫలితం వచ్చే ఇండియా బడ్జెట్టు నాటికిగాని పూర్తిగా అవగాహన కాదని రాజకీయ వర్గాలు భావిస్తున్నవి.

*　　*　　*

ఆంధ్రుల అభ్యున్నతికి సైంధవులుగా ముగ్గురు అడ్డపడ్డారని ఢిల్లీ ఆంధ్రులు బహిరంగంగా చెబుతున్నారు. ధార్ కమిటీచేత భాషారాష్ట్రాలు వలదని వ్రాయించినవాడు నేటి యు. పి. గవర్నరు శ్రీ కె.యం.మున్షీ అట. రాష్ట్ర విభజన సంఘం నివేదిక చూడకుండానే ఆంధ్రరాష్ట్రాన్ని వాయిదా వేయించినవాడు అప్పటి హోంశాఖ కార్యదర్శి శ్రీ హెచ్. వి. అయ్యంగార్ అట. ఇప్పుడు ఖోస్లా కమిటీని వేదికను తీరగదోయించినది శ్రీ టి. టి. కృష్ణమాచారి అట. ఎక్కడికక్కడ ఉన్నత పదవులలో వున్నవారు ఈ విధంగా సంకుచితదృష్టితో వ్యవహరిస్తున్నప్పుడు ఉన్నత హోదాలలో వున్న తెలుగువారు విశాల హృదయంతో వుంటే ప్రయోజనమేమిటి చెప్పమంటున్నది ఆంధ్రజాతి. బహుశా కొంతకాలానికి వారు ప్రజలకు సమాధానం చెప్పుకొనలేని స్థితిలో పడగలరని హెచ్చరించవచ్చునేమో కూడా.

విప్రున్న చెప్పిందే వేదం అన్నట్టు రాజాజీ చెప్పిందే రాజ శాసనం అనే ధోరణిలో మద్రాసు పత్రికలు ప్రచారం చేస్తున్నవి. చీరెలు ధోవతులను చేనేతకు పూర్తిగా రిజర్వుచేయాలని రాజాజీ చేసిన; సూచనను కాదన్న వాణిజ్యమంత్రి శ్రీ కృష్ణమాచారి వాదనను సమర్థిస్తూ రాజాజీ చెప్పినట్టు చేయడం ప్రమాదకరమని నాగపూర్‌లో నెహ్రూ ప్రకటించాడు. మరి ఇప్పుడు ఈ పత్రికలు ఎలా ప్లేటు మార్చగలరో చూడవలసి వుంది. ఇంతకీ చెన్నరాష్ట్రం దృష్ట్యా రాజాజీ మాట్లాడితే మిల్లు చీరెలు ధోవతులను ఎక్కువగా దిగుమతి చేసుకొనే యు. పి. దానికి వ్యతిరేకంగా వాదించిందట. అంతటితో ఈ ఆలోచనకు స్వస్తి చెప్పి, చేనేత సలహా సంస్థ అనే దానిని కేంద్రం నియమించింది. ఇలా చేయడం బొంబాయి మిల్లు యజమానులకు లొంగడమే కాక నెహ్రూ స్వరాష్ట్రాభిమానం చూపించాడని కూడా అనగలరేమో అరవ రాజకీయవాదులు. అందుకే ఒకవైపున ఉత్తరాది దక్షిణాది భేదాన్ని రెచ్చగొట్టే ద్రవిడకజగాన్ని ఒక పెద్ద బూచీగా తయారుచేస్తున్న తమిళసోదరులు, ఇలా కొందరిని కొంతకాలం కన్ను గప్పగలరు కాని ఎల్లకాలం ఎల్లరిని మోసపుచ్చలేరు కదా.

—"గౌరీశంకర్"

# "కుక్క తోక"

"కృష్ణానంద్"

"కుక్క తోకనాడించును. ఏలనన తోకకంటె కుక్క బలమైనదికాబట్టి. ఒకవేళ తోకయే బలమైనదైనచో ఆ కుక్కనే నిలబెట్టి ఆడించును."

వేమనంతటివాడే కుక్కతోకను పట్టుకొని గోదావరి ఈదలేకపోయాడు. కుక్కతోకనే వాడడంలో వేమనకు కుక్కతోకలోగల శక్తి సామర్థ్యాలమీద నమ్మకం మనకు తెలుస్తుంది. కుక్క తోకనాడించడం అనేది ప్రకృతి సహజం; పరమ నగ్నసత్యం. తోకాడించని కుక్క కుక్క ఎలా అవుతుంది? దీనికి ఒక వంకరతోక వుండాలి. పైగా ఆడుతూవుండాలి. బాగానేవుంది, కాని ఒకవేళ తోకయే బలమైనదైనచో అది కుక్కని నిలబెట్టి ఆడిస్తుంది! వేమనకే అందులో చాలా నమ్మకంవుంది! డార్విన్‌లాంటి మహాశయుడొకడు బయల్దేరి, పరిణామంలో కోతితోక ఎలాహరించి పోయిందో అలాగే ఈ కుక్కకికూడా పిక్కల్లో బలం తోకలోకివచ్చివుండవచ్చని ముందు శతాబ్దాల్లో (తోక కుక్కనాడించేకాలంలో) అంచనా కట్టి ఇవల్యూషన్ థియరీకి పునాదులుగట్టిగా వేయ

వచ్చు. అప్పుడు తోకమీద నిలబడి గిరగిరతిరిగే, గెంతే కుక్కనిచూస్తే చాలాముచ్చటగా వుండ వచ్చు. అప్పటి పరిస్థితులు ఒకసారి ఊహించి చూడండి.

రాజుచేతిలో వాడు మంత్రి. ఏలనన మంత్రి కంటె రాజు గొప్పవాడుకాబట్టి. ఒకవేళ మంత్రి "గొప్ప" అయినచో ఆ రాజును వొట్టి చచ్చు పెద్దమ్మను చేసి కూర్చుండబెట్టును.

ఇలాంటి రాజుల్ని మంత్రుల్ని మనం చాలా మందినిచూశాం చరిత్రలో. రాజులు చవటలయితే మంత్రులే రాజ్యాలేలుతారు.కుక్కనితో కాడించడం మనం చూడలేకపోవచ్చుగాని మంత్రులు రాజ్యాలని ఏలడం, మనం ఎరిగివున్నదే. ఐతే రాజులు రాజ్యాలు ఏలేకాలంలో మంత్రులు రాజ్యాలు ఏలడం ఆశ్చర్యంగానే వుంటుంది అప్పటి వాళ్ళకి. కాని తర్వాత మంత్రులే రాజ్యాలేలారు.

మంత్రి ప్రజలను పాలించును. ఏలనన వాడు ప్రజలకు ప్రతినిధి. ఒకవేళ ప్రజకి ఇష్టం లేకపోయిన యెడల ఆ మంత్రిని చవటను జేసివైతురు.

ఇది ప్రస్తుతకాలంలోని ఒక వైపరీత్యం. పరిణామదశలో కుక్కని తోక ఆడించే పరిస్థితులు ఇంకా ఏర్పడలేదు కాని, ప్రజలు మంత్రుల్ని ఆడించేకాలం వచ్చింది. వాళ్ళు వీళ్ళని ఆడిస్తారు. వీళ్ళు వాళ్ళని ఆడిస్తారు. మామూలుగా కుక్క తోకాడించును. కాని మనుష్యుల్లో "తోక" "కుక్క" నాడిస్తోందిగా! ఇదేం విడ్డూరం లేదు. ఇదొక విపరీత ధర్మసూత్రం, "కుక్కని తోకాడించును."

రాజ్యాంగ విధానం కుక్క తోకలాంటిది. రాజకీయవేత్త నక్కలాంటివాడు! నక్క కుక్కల సంపుటే పరిపాలన. కుక్కతోక వంకరగా నుండును. దానిని ఏ 'తుగ్లక్' అయినా కనీసం "తెనాలి రామలింగా" అయిన ఒక తిరగలి క్రింద అరశతాబ్దం వుంచినా, కుక్కతోక వంకర అనే సిద్ధాంతం చెక్కు చెదరదు. పరిపాలన కూడా అంతే. లోపాలులేని పాలనా, వంకరలేని కుక్కతోకా ఆదర్శమాత్రాలే! నక్కకి కుక్కకి బద్ధవైరం, జన్మతః శత్రువులు. నక్కవచ్చి కుక్క తోకని సరిచేసే దౌర్భాగ్యస్థితి ప్రకృతిలో ఇంకా ఏర్పడలేదు. కాని రాజకీయ వేత్త రాజ్యాంగ విధానాన్ని ఇష్టం వచ్చినట్లు తిప్పేస్తున్నాడు. ఆడించేస్తున్నాడు. తోక కుక్కనాడిస్తోందన్నమాట. కుక్క తోకనాడించినా తోక కుక్క నాడించినా అది వంకరగానే వుంటుంది. ఎంతమంది రాజకీయవేత్తలు ఎంత కాలం తలలు బద్దలు కొట్టుకొన్నా రాజ్యాంగము లోపభూయిష్ఠముగానే వుంటుంది. తాత్కాలికంగా కొంచెం సర్గ్గా వున్నప్పటికీ ఎప్పటిలాగే, కుక్కతోక వంకర.

అసలు మానవ సహజ ప్రకృతే కుక్కతోక లాంటిది. దానిని సరిజేయడం, తిన్నగా వుంచడము ఆధునిక శతాబ్దత్రయ శాస్త్రవిజ్ఞానానికి, 20వ శతాబ్దపు మనిషికి తలకు మించిన పని. కుక్కతోక తాత్కాలికంగాతిన్నగావుంటుంది. మహాత్ముడు చాలావరకు సాధించాడు కాని, మానవ ప్రకృతి వున్నంతకాలం మహాత్ముడువుండలేడు. మహాత్ముడు పోయాడు. కుక్కతోక తిరిగి తన సహజస్వభావాన్ని అమల్లో పెట్టుకొంది. "అవతార పురుషులు" భూమ్మీదికి దిగడం కుక్కతోకని సాగదీయడానికే. వాళ్లు పట్టుకొని కూర్చొన్నంత కాలం సరిగావుంటుంది, అటు వాళ్లు నిర్యాణం పొందడం ఇటు కుక్కతోక వంకర అవడం ఒకసారే జరుగుతుంది.

తన వ్యక్తిత్వాన్ని నిలబెట్టుకోవాలని, తన ప్రత్యేకతని కాపాడుకోవడానికి సృష్టిలో ప్రతి ప్రాణి సాయశక్తులా శ్రమిస్తుంది. కుక్క తన వంకర తోకని వొయ్యారంగా ఆడిస్తూ గంభీరంగా భావయుక్తంగా మొరుగుతూంటుంది. గాడిదలు ఓండ్రపెడతాయి. రాజకీయవేత్త గొంతుచించుకు, బల్లగుద్ది, అరుస్తుంటాడు.

మగవాడు అలసటచెంది కుదుటబడ్డంకోసం పెళ్లి చేసుకుంటాడు. ఆడది కుతూహలంకొద్దీ పెళ్లి చేసుకుంటుంది. చివరకి యిద్దరూ నిరాశ చెందుతారు.

—ఆస్కార్ వైల్డ్.